సాక్షి సూర్యాపేట

సోమవారం ၊ 25 ၊ నవంబర్ ၊ 2024



రుణమాఫీలో సర్కార్ విఫలం

రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. - 8లో



చెర్వుగట్టులో భక్తజనం

కార్తీక మాసం సందర్భంగా చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. - 8లో



బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తే..

బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

విద్యార్థి దశనుంచే లక్ష్యం కలిగి ఉండాలి



సమస్యలు తెలుసుకుంటున్న మహిళా కమిషన్ సభ్యురాలు రమాదేవి

చివ్వెంల: ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ రమాదేవి యాదవ్ అన్నారు. ఆదివారం చివ్వెంల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు పట్టికలు, మౌలిక వసతులు, భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను మెనూ వివరాలు, సమస్యలు అడిగి తెలుసుకన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భావిపౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ సిబ్బంది హేమలత, శైలజ, సోషల్ వర్కర్ శ్రీలక్ష్మీ, హబ్ మహిళా సాధికారిత కోఆర్డినేటర్ చైతన్య, ఎస్ఓ బి.నాగలక్ష్మీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుంగతుర్తి మార్కెట్‌కు నూతన పాలకవర్గం



తీగల గిరిధర్‌రెడ్డి, చెర్మన్



చింతకుంట్ల వెంకన్న, వైస్‌చైర్మన్

తుంగతుర్తి: తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనకల్‌కు చెందిన తీగల గిరిధర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన చింతకుంట్ల వెంకన్నను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా సగ్గం నర్సయ్య, వాసం వెంకన్న, జటంగి లింగయ్య, కారింగులు యాకసాయిలు, ఎండీ నసిమూన్నీసాబేగం, బానోతు శ్రీను, బత్తుల నాగమల్లు, భూక్య మధు, పాక అమృతమల్లు, కొమ్ము వెంకన్న, ఆర్.మమతదేవి, బండారు దయాకర్‌లను నియమించింది.

మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాగార్జున రెడ్డి

భానుపురి (సూర్యాపేట): ఈనెల 29, 30, డిసెంబర్ 1న సూర్యాపేటలో జరిగే సీపీఎం మూడో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఆహ్వాన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దండా వెంకట్‌రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, ఎలుగూరి గోవిందు, నరసింహారావు, వీరబోయిన రవి, మేకపోయిన శేఖర్, జ్యోతి, సైదమ్మ, నరసయ్య, రాంబాబు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని స్థల వివాదం

- కోదాడ వైద్యశాలకు దాత ఇచ్చిన స్థల సమస్యను పరిష్కరించే వారేరి!
- ఒకే తీర్పును మూడు రకాలుగా అమలు చేసిన అధికారులు
- దాత వారసుడికి తిరిగి 535 గజాల స్థలం అప్పగింత
- నోరుమెదపని వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు
- నేడు కలెక్టర్ సమక్షంలో విచారణ జరిగే అవకాశం



కోదాడ ప్రభుత్వ వైద్యశాల

కోదాడ: కోదాడ ప్రభుత్వ వైద్యశాల స్థల వివాదం 15 ఏళ్లగా కొలిక్కిరావడం లేదు. కోర్టు ఇచ్చిన ఒకే తీర్పును మూడు విధాలుగా అమలు చేయడంతో పాటు అధికారుల మధ్య సమన్వయ లోపంతో వైద్యశాల స్థలం పరాధీనం అవుతోంది. వైద్యశాల నిర్మాణానికి దాత ఇచ్చిన రెండు ఎకరాలకు ప్రస్తుతం 10 గుంటలు తక్కువగా ఉన్నా 560 గజాల స్థలం ఎక్కువగా ఉందని దాత వారసుడికి అప్పగించడంపై వివాదం కొనసాగుతూనే ఉంది. దీనిపై సామాజిక కార్యకర్తలు.. ఉన్నతస్థాయి అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు.

కోర్టు తీర్పును తప్పుగా అమలు చేశారా?

కోదాడ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి తమ పెద్దలు దానం ఇచ్చిన రెండు ఎకరాల కన్నా ఎక్కువ స్థలం కాంపౌండ్ లోపల ఉందని దాత వారసులు కోర్టుకు వెళ్లారు. దీనికి కోర్టులో జరిగిన వాదప్రతివాదనల అనంతరం ఒకవేళ వైద్యశాల కాంపౌండ్ (ఆక్యుపేషన్) లోపల ఉన్న స్థలాన్ని కొలిచి రెండు ఎకరాలకు ఎక్కువగా ఉంటే పిటిషనర్‌కు ఇవ్వాలని కోర్టు 15 ఏళ్ల క్రితం అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్‌కు సూచించింది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో సర్వే అధికారులు వైద్యశాల కాంపౌండ్‌లో కొలవకుండా దాని వెలుపల మున్సిపల్ రోడ్లను కొలిచి రెండు ఎకరాల కన్నా 535 గజాల స్థలం ఎక్కువగా ఉందని నిర్ధారించి దాత వారసుడికి అప్పగించారు. దీనిపై వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ 10309/ఈ/2009 తేది 10-12-2003న డీఓ లెటర్ రాస్తూ సర్వే అధికారులు కోర్టు ఉత్తర్వులను తప్పుగా అర్థం చేసుకొని కొలిచారని విన్నవించారు. దీంతో అప్పటి కలెక్టర్ మరోసారి కొలిపించారు. రెండు ఎకరాలకు 10 గుంటలు తక్కువగా ఉందని నిర్ధారించి గతంలో ఇచ్చిన ప్రొసీడింగ్ నంబర్‌లో తప్పు జరిగిందని, దానిని రద్దు చేస్తున్నట్లు, దాత వారసుడికి ఇచ్చిన 535 గజాల స్థలాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు.

మరోసారి కొలిచి ఇచ్చేశారు..

కాంపౌండ్ లోపల రెండు ఎకరాలకు 10 గుంటలకు తక్కువగా ఉందని జిల్లా కలెక్టర్ నిర్ధారించినప్పటికీ దాత వారసుడు తన సమక్షంలో కొలవలేదని మరోసారి కోర్టుకు వెళ్లారు. దీంతో మరోసారి కొలవాలని కోర్టు ఆదేశించింది. దీంతో మరో కలెక్టర్ హయాంలో అధికారులు మళ్లీ కాంపౌండ్ లోపల కొలవకుండా రెండు ఎకరాలకు 500 గజాలు ఎక్కువగా ఉన్నట్లు రిపోర్టు ఇచ్చారు. ఎక్కువగా ఉన్న ఈ స్థలాన్ని పిటిషనర్‌కు తిరిగి అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో 535 గజాలను దాత వారసుడికి ఇచ్చారు. రెండోసారి 500 గజాలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి అతడు కోర్టు కేసును వెనక్కి తీసుకోవాలని షరతుపెట్టి ఇచ్చారు. ఐతే మొదటిసారి ఇచ్చిన 535 గజాలకు పంచనామా చేసి 500 గజాలు దాత వారసుడికి, 35 గజాలను వైద్యశాల అధికారులకు అప్పగించాల్సి ఉన్నా అది అమలు కాలేదు. ఇలా కలెక్టర్లు ఒకే తీర్పును మూడు రకాలుగా అమలు చేసి దాత వారసుడికి 500 గజాల స్థలం అప్పగించడం గమనార్హం.

మౌనం వీడని వైద్యశాఖ, ప్రజాప్రతినిధులు

30 పడకలుగా ఉన్న కోదాడ ప్రభుత్వ వైద్యశాలను ఇటీవల 100 పడకలుగా మార్చారు. ప్రస్తుతం ఉన్న స్థలంలోనే కొత్త భవనం నిర్మిస్తామని చెబుతున్నారు. కానీ, వైద్యశాలలో రెండెకరాల కన్నా తక్కువ స్థలం ఉన్నా దొడ్డిదారిన దాత వారసుడు ఆక్రమించినప్పటికీ మాట్లాడాల్సిన వైద్యశాఖ అధికారులు, స్థానిక వైద్యశాల అభివృద్ధి కమిటీ మౌనంగా ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సోమవారం కలెక్టర్ సమక్షంలో స్థల వివాదంపై విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని వంద పడకల వైద్యశాల భవన నిర్మాణానికి కృషి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

- నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- త్వరలోనే కొత్త రేషన్ కార్డులు
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హుజూర్‌నగర్‌లో ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యేలు

హుజూర్‌నగర్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.. ప్రజలకిచ్చిన హామీలన్నీ నూరు శాతం అమలు చేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7వ తేదీ నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. నూతన ప్రాజెక్టులు, లిఫ్టుల నిర్మాణంతోపాటు పాత వాటికి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 158 మెట్రిక్ టన్నుల వరిపంట సాగై దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి చివరి గింజవరకు కొనుగోలు చేస్తామన్నారు. త్వరలో నూతన రేషన్ కార్డులు అందజేస్తానని పేర్కొన్నారు.

త్వరలోనే ఆరు లేన్ల రహదారి పనులు

హైదరాబాద్ నుంచి కోదాడ వరకు ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు మొదలు కానున్నాయని మంత్రి ఉత్తమ్ చెప్పారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వయా హుజూర్‌నగర్-కోదాడ మీదుగా రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. త్వరలోనే హుజూర్‌నగర్, కోదాడకు రైల్వే లైన్ రానుందని మంత్రి ప్రకటించారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు, గీత కార్మికులకు సేఫ్టీ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య, కోదాడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు పద్మావతి, మందుల సామేలు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్మన్లు గెల్లి అర్చనరవి, ప్రమీల, బచ్చలకూరి ప్రకాష్, వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన విజయోత్సవంలో కళాకారుల నృత్య ప్రదర్శన

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు షీల్డులు అందజేస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తదితరులు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని, చెస్ పోటీల్లో పాల్గొనడం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట టీటీడీ కల్యాణ మండపంలో ఓపెన్, అండర్-11, 15 విభాగాల్లో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా చదరంగ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా నుంచి ఎంతో మంది చెస్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. అనంతరం ఓపెన్ కేటగిరీ, అండర్-11, 15 పోటీల్లో విజేతలైన బాలబాలికలకు షీల్డులతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చెరుకు సుధాకర్, గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఎం.శ్రీనివాస్‌గౌడ్, చెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

చివ్వెంల: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ అన్నారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలని ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమం కరపత్రాలను ఆదివారం చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలోని లెనిల్ నగర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా, మండల కేంద్రాల్లో నిర్వహించే ఈ నిరసనలకు అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గులాం హుస్సేన్, పొల్వాయి రాములు, పుప్పాల ఉపేందర్, శ్రీరామ్, జయమ్మ, లక్ష్మి, రేణుక, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశానికి తరలిరండి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 26న నిర్వహించనున్న జిల్లాస్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దీక్ష దివస్‌కు 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, ఉప్పల ఆనంద్, నెమ్మాది భిక్షం, బాషా, మధుసూదన్‌రెడ్డి, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

అందని జీతం.. బతుకు భారం





తొండ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు, చెత్త సేకరిస్తున్న కార్మికులు

- వేతనాలు రాక గ్రామ పంచాయతీ కార్మికుల వ్యథ
- ఆరు నెలలుగా ఎదురుచూపులు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన

తిరుమలగిరి (తుంగతుర్తి): నిత్యం పారిశుద్ధ్య పనులు చేస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పంచాయతీ కార్మికులకు వేతన వెతలు తప్పడం లేదు. దా దాపు ఆరు నెలలుగా కార్మికులకు వేతనాలు అందడం లేదు. దీంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతు న్నాయి. దసరా, దీపావళి పండుగలకు వేతనాలు వస్తాయని ఆశపడ్డా నిరాశే ఎదురైంది. దీంతో అప్పులు చేసి పండుగలు జరుపుకున్నారు. జిల్లాలో 475 గ్రామ పంచాయతీల్లో 1,942 మంది మల్టీపర్పస్ వర్కర్లు (ఎంపీడబ్ల్యూ) వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులుగా మల్టీపర్పస్ వర్కర్లు

పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర పనుల కోసం మల్టీపర్పస్ వర్కర్లను నియమించారు. అవసరానికి అనుగుణంగా వీరికి వివిధ పనులు అప్పగిస్తున్నారు. వాటర్‌మెన్, పారిశుద్ధ్య కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్, పంపు ఆపరేటర్, ఎలక్ట్రిషియన్ తదితర విభాగాల్లో పని చేస్తున్నారు. జీఓ నంబర్ 51 ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదైన ఒక్కో కార్మికునికి నెలకు రూ.9,500 చెల్లిస్తారు. వీరితో పాటు అవసరాల మేరకు ఆయా పంచాయతీల్లో తాత్కాలికంగా పనిచేసే వారికి నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేలు చెల్లిస్తున్నారు. కానీ, వీరందరికీ ఆరునెలలుగా వేతనాలు అందకపోవడంతో జిల్లా అధికారులకు విన్నవిస్తూ వస్తున్నారు. అయినా స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించాలని పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



నెలవారీగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఆరు నెలల నుంచి జీతాలు రాలేదు. అధికారులను అడిగితే వస్తాయని చెబుతున్నారు. ఇప్పటికైనా వేతనాలు చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలి.

– ప్రసాద్, కార్మికుడు, తొండ గ్రామం

ప్రతినెలా వేతనాలు ఇవ్వాలి



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు వచ్చేదే తక్కువ జీతం. ప్రతినెలా కార్మికులకు వేతనాలు ఇవ్వాలి. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది.

– గౌరయ్య, కార్మికుడు, తొండ గ్రామం

నిధులు విడుదల కాక..

రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి గ్రామ పంచాయతీలకు రెండేళ్ల నుంచి సరిగా నిధులు విడుదల కావడం లేదు. కేంద్రం నుంచి సైతం నెల వారీగా నిధులు రావడం లేదని తెలుస్తోంది. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాల కోసం నిధులు పంపుతున్నా అవికూడా నెలవారీగా అందించలేని పరిస్థితి నెలకొంది.

మహిళా కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

కోదాడ: వచ్చేనెల 7వ తేదీ నుంచి 10 వరకు హైదరాబాద్‌లో జరిగే సీనియర్ మహిళా కబడ్డీ పోటీల్లో ఆడేందుకు ఆదివారం కోదాడలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో జిల్లా జట్టును ఎంపిక చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూసిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులకు అల్లం ఉషారాణి జ్ఞాపకార్థం అల్లం ప్రభాకర్‌రెడ్డి క్రీడా దుస్తులను అందించారు. ఈ కార్యక్రమం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అడహక్ కమిటీ సభ్యులు భూపతిరావు, కర్తయ్య, మహబూబ్‌జానీ, అల్లం ప్రభాకర్‌రెడ్డి, రమేష్, స్థానిక క్రీడాకారులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో డిసెంబర్ 30న నిర్వహించే బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. దేశ స్వాతంత్రోద్యమంతోపాటు తెలంగాణ మలిదశ పోరాటం వరకు కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఎల్లంల యాదగిరి, జంపాల మల్లయ్య, ఎం.డి.ఫయాజ్, ఇక్బాల్, శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకన్న, స్వరూప, అశోక్, ఎల్లమ్మ, కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

38 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక



సమ్మేళనంలో పాల్గొన్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, పూర్వ విద్యార్థులు

సూర్యాపేట టౌన్: 38 ఏళ్ల క్రితం పదో తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపై కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరినొకరు తమ యోగాక్షేమాలను అడిగి తెలుసుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మొరిశెట్టి అంతయ్య మెమోరియల్ (ఎంఏఎం) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (1986-1987) పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ హాజరై మాట్లాడుతూ జీవితంలో స్నేహం అనేది చెరిగిపోని తీపి జ్ఞాపకమన్నారు. పదో తరగతి చదివి ఇన్నేళ్ల తర్వాత ఒకే వేదికపై అందరూ కలుసుకుని ఆనందంగా గడపం శుభపరిణామని పేర్కొన్నారు. ఈ సమ్మేళ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

మఠంపల్లి : పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆదివారం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోజ్యాతండాకు చెందిన గర్భిణి అజ్మీరా రోజా పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో మహిళను వాహనంలో హుజూర్‌నగర్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా పెదవీడు వద్దకు చేరుకోగానే నొప్పులు ఎక్కువై 108సిబ్బంది సహాయంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇరువురిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో కాన్పు చేసిన 108సిబ్బందిని పలువురు అభినందించారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం


భిక్షం (ఫైల్)

పెన్‌పహాడ్ : ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒగ్గు భిక్షం(40) అదే గ్రామానికి చెందిన దండెంపల్లి సుధాకర్ వ్యవసాయ క్షేత్రంలో స్తంభంపై విద్యుత్ తీగలు తీసేందుకు భిక్షంను కూలీ పనులకు తీసుకెళ్లాడు. విద్యుత్ తీగలను లాగుతున్న క్రమంలో స్తంభం పైన ఉన్న భిక్షం తాడు సహాయంతో విద్యుత్ తీగను అందుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు జారీ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయమై ఎస్ఐ గోపికృష్ణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

నకిరేకల్ : ఉరివేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కడపర్తి గ్రామానికి చెందిన పందిరి నాగమ్మ(38) భర్త కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో పట్టణంలోని ఎస్ఎల్‌బీసీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటుంది. నాగమ్మ మానసిక, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అద్దె ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు సూరారం భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఓ కుమారుడు ఉన్నాడు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి

మోతె : మండల పరిధిలో రావిపహాడ్ గ్రామంలో స్వాతంత్య్ర సమరయోధురాలు కోట లక్ష్మమ్మ(101) ఆదివారం తెల్లవారుజామున మరణించింది. కోట లక్ష్మమ్మ కుటుంబం మొదటి నుంచి కమ్యూనిస్టు పార్టీలో చురుగ్గా వ్యవహరించేవారు. నాడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి సాయుధ పోరాట దళంలో రావిపహాడ్ గ్రామ కమ్యూనిస్టు ఉద్యకారులతో కలిసి లక్ష్మమ్మ పనిచేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. కోట లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు (కోట పాపిరెడ్డి, కోట గోపాల్‌రెడ్డి, కొప్పుల సూర్యమ్మ, నందిగామ సుజాత) ఉన్నారు. రావిపహాడ్‌కు చెందిన కమ్యూనిస్టు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు కోట లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాడపంగి యలమంచి, సురేందర్‌రెడ్డి, కోడి గంగయ్య, పాపిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం


హుజూర్‌నగర్ : చింతలపాలెంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్, కలెక్టర్, అధికారులు

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం చింతలపాలెం మండల కేంద్రంలో రూ.2.61కోట్లతో నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయం, రూ.2.98కోట్లతో ఎంపీడీఓ కార్యాలయం, రూ.2.38కోట్లతో పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం, రూ.10కోట్లతో చేపట్టనున్న మేళ్లచెరువు – చింత్రియాల రోడ్డు పనులకు, రూ.10కోట్లతో చేపట్టనున్న కిష్టాపురం నుంచి పీఆర్ సిమెంట్ వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలలో ఆయన మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో తన హయాంలో రోడ్లు, లిఫ్టులు మంజూరు చేయించానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న అన్ని లిఫ్టులను వినియోగంలోకి తేచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. తొలుత చింతలపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి ఉత్తమ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలలో కలెక్టర్ తేజస్‌నందలలాల్ పవార్, అదనపు ఎస్పీ నాగేశ్వరావు, ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ సీతారాం, డీఈ పవన్‌కుమార్, ఏఈ సతీష్‌కుమార్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి, ఆర్ఐ వాసుదేవరావు, నాయకులు నరాల కొండారెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, సీతారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రాకు ముఖచిత్రంగా మారనున్న మఠంపల్లి : మంత్రి

మఠంపల్లి : తెలంగాణ–ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న మఠంపల్లి మండలానికి రూ.80కోట్లతో చేపట్టిన డబుల్‌రోడ్డు నిర్మాణంతో ముఖచిత్రం మారిపోనుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలో రూ.80కోట్లతో చేపట్టనున్న హుజూర్‌నగర్–మట్టపల్లి డబుల్‌రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించానన్నారు. ముఖ్యంగా వేలాది ఎకరాల భూములకు సాగునీరందించేందుకు ఎత్తిపోతల పథకాలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యవసాయ కూలీ బలవన్మరణం

కేతేపల్లి : కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపంతో ఓ వ్యవసాయ కూలీ పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండంలోని తుంగతుర్తి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన ఉప్పుల మల్లయ్య (45) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మల్లయ్య తన కూతురు వివాహంతో పాటు, కుటుంబ అవసరాల కోసం గ్రామంలో తెలిసిన వారి దగ్గర అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీరే మార్గం లేకపోవడంతో మనస్థాపం చెందిన శనివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మల్లయ్యను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మల్లయ్యకు భార్య, వివాహమైన కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తే సహించేది లేదు

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హాలియా : బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. హాలియాలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నందుకు నిరసనగా బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలో చేపట్టిన చలో బీసీ.. హాలో హాలియా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హాలియా పట్టణంలో కుమ్మర సోదరులు మొల్లమాంబ విగ్రహాన్ని పెడుతుంటే దురుద్దేశంతో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీసీ నేతల విగ్రహాలను జేసీబీలతో తొలగిస్తే బీసీలంతా ఐక్యంగా రాజకీయ పార్టీల నాయకుల కుర్చీలను కూల్చివేస్తామని హెచ్చరించారు. జానారెడ్డికి పదవి వ్యామోహం ఇంకా తగ్గలేదని, తన తనయులకు పదవులు వచ్చేలా చేసుకున్నారన్నారు. హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైశ్య కులానికి చెందిన పార్వతమ్మను పదవి నుంచి తొలగించి నరేందర్‌రెడ్డి అనే వ్యక్తికి పదవి కట్టబెట్టారని విమర్శించారు. బీసీ కులానికి చెందిన వెంకటేశ్వర్లు యాదవ్‌ను మార్కెట్ చైర్మన్ పదవి నుంచి తొలగించి శేఖర్‌రెడ్డిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. బీసీలు అధికారంలోకి రాగానే ఉద్యోగాలు పొందిన ఓసీలను రీకాల్ చేస్తామన్నారు. మొల్లమాంబ విగ్రహాన్ని అవమానపర్చిన మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉంటే కేవలం ఒక్క బీసీ, ఇద్దరు ఎస్సీ, ఒక ఎస్టీ ఎమ్మెల్యేలు ఉన్నారన్నారని, మిగిలిన ఎనిమిది మంది రెడ్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చెబితే జానారెడ్డి దానిని అడ్డుకున్నారని ఆరోపించారు. త్వరలో నాగార్జున సాగర్ నియోజకవర్గంతో పాటు నల్లగొండ ఎన్జీ కాలేజీలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, బీసీ నాయకులు, వట్టె జానయ్య, మహేష్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, సుదర్శన్, పొదిలి శ్రీనివాస్, నల్లగొండ సుధాకర్, సైదులుగౌడ్, అర్జున్, కోట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

మునుగోడు: ఇసుక వాగులోని నీటి కుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన సంఘటన మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మునుగోడు పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. చొల్లేడు గ్రామానికి చెందిన దోటి సత్తయ్య (31) అనే మతిస్థిమితం లేని వ్యక్తి తమ ఇంటి నుంచి అప్పుడప్పుడు బయటకు వెళ్లి రెండుమూడు రోజులకు తిరిగి వచ్చేవాడు. అదే తరహాలో ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సత్తయ్య తిరిగి రాలేదు. ఎప్పటిలాగే రెండు రోజుల తరువాత వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. కాగా సత్తయ్య మృతదేహం ఆదివారం ఆ గ్రామ వాగులోని ఓ నీటి కుంటలో కనిపించిందని గ్రామానికి చెందిన వంగూరి శంకరయ్య అనే వ్యక్తి బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సత్తయ్య మృతదేహాన్ని పరిశీలించి బయటకు తీశారు. సత్తయ్య మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ రవి తెలిపారు. సత్తయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

కేతేపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంలో విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. కేతేపల్లిలో నూతనంగా నిర్మించిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి స్మారక భవనాన్ని(సీపీఎం మండల కార్యాలయం)సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డితో కలసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే రూ.31 వేల కోట్లు ఖర్చవుతుందని, కానీ, కేవలం రూ.18 వేల కోట్లు మాఫీ చేసి మొత్తం రుణమాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటోందన్నారు. రైతు భరోసా, వ్యవసాయ కార్మికులకు ఏటా రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2500 పంపిణీ ఊసే లేకుండా పోయిందన్నారు. బీజేపీ అణగారిన వర్గాల కోసం కాకుండా.. కేవలం అదానీ,అంబానీల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ.. పదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. భారత్‌ను హిందూ దేశంగా మార్చేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కుట్ర పన్నుతుందని విమర్శించారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి చింతమళ్ల లూర్దుమారయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుదాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, బొజ్జ చినవెంకులు, అశోక్‌రెడ్డి, కోట లింగయ్య, ఎల్.రాజు, శోభన్, ఎ.సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలి

చిట్యాల: ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ ప్రతిపాదిస్తున్న ఒకే దేశం–ఒకే ఎన్నికల(జమిలి ఎన్నికలు) విధానాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ కోరారు. చిట్యాలలో ఆదివారం జరిగిన డీవైఎఫ్ఐ నల్లగొండ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ వడ్డెగాని మహేష్, మహమ్మద్ అక్రం, జిట్ట రమేష్, కట్ట లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పంది నరేష్, అవిశెట్టి కిరణ్, కార్తీక్, సీపీఎం నాయకులు అర్రూరి శ్రీను పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

చివ్వెంల(సూర్యాపేట) : నల్లబెల్లం, పటిక, నాటుసారాను అక్రమంగా తరలిస్తున్న డీసీఎంను ఎక్సైజ్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు.. అసిస్టెంట్ కమిషర్ సంతోష్, సూర్యాపేట ఎక్సైజ్ ఎస్పీ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండా గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా డీసీఎంలో తరలిస్తున్న నల్లబెల్లం 2750 కిలోలు, పటిక 40 కిలోలు, నాటుసారా 10 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న నాగయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు వ్యక్తులు లునావత్ వెంకన్న, ఉపేందర్, వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేష్, ఎస్ఐలు సురేందర్ బెనర్జీ, గోపాల్‌రావు, శోభారాణి, కానిస్టేబుళ్లు అప్సర్, అయూబ్, గఫూర్, క్రాంతి పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడరూరల్ : ఏపీ నుంచి కోదాడకు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని కోదాడ రూరల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని లింగాల వాగు నుంచి అక్రమంగా ఇసుకను లారీలో లోడ్ చేసి కోదాడకు తరలిస్తుండగా రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. నందిగామకు చెందిన డ్రైవర్ రావెళ్ల శ్రీనివాసరావుతోపాటు యాజమాని గోపిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చెర్వుగట్టులో భక్తజన సందోహం

నార్కట్‌పల్లి : కార్తీక మాసం సందర్భంగా నార్కట్‌పల్లి మండల పరిధిలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో లడ్డూ ప్రసాదం కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేశారు. టోల్‌గేట్ నిర్వాహకులు రుసుము తీసుకోని వాహనాలను గుట్టపైకి పంపడంతో గుట్టపైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆలయ అధికారులు, పోలీసులు స్పందించి గుట్టపైన ట్రాఫిక్ జామ్ కాకుండా వాహనాలను గుట్టు పైకి అనుమతించలేదు. ఈ వేడుకల్లో ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, రాజ్యలక్ష్మి, వంశీ, అర్చకులు శ్రీకాంత్, సురేష్, సతీష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక వన సమారాధన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని పాత సూర్యాపేట స్టేజీ వద్ద గల శ్రీ సంతోషిమాత ఉద్యాన వన క్షేత్రంలో ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ సంతోషి రూపాదేవి సేవా సమితి ఆధ్వర్యంలో 21 సంవత్సరాలుగా సూర్యాపేట శ్రీ సంతోషిమాత ఆలయం ఆధ్వర్యంలో శ్రీ సంతోషి రూపాదేవి సేవా సమితి సహకారంతో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కాశీ నుంచి తెచ్చిన 108 శివలింగాలతో మహాన్యాస రుద్రాభిషేకం, తులసీ పూజ, ఆమలక పూజలు, సంతోషిమాత పూజలు, మ్యూజికల్ చైర్స్, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి దంపతులు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పబ్లిక్ క్లబ్ సెక్రటరీ కొప్పుల వేనారెడ్డి, పోతు భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు గోపగాని వెంకట నారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశంగుప్తా, మురళీధర్, సోమ శ్రీశైలం, అశోక్, కొత్త మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి స్పెల్ బీకి అపూర్వ స్పందన


సాక్షి స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న జయ, కోదాడ తేజ విద్యాలయం, ఎస్పీఆర్ గురుకుల్ పాఠశాలల విద్యార్థులు


అల్పాహారంగా అందించిన బిస్కెట్లను చూపిస్తున్న విద్యార్థులు


మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న కోదాడ తేజ విద్యాలయం విద్యార్థులు

- ఉత్సాహంగా పాల్గొని పరీక్ష రాసిన విద్యార్థులు
- జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో నిర్వహణ


మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న సూర్యాపేట జయ విద్యాలయం విద్యార్థులు

SAKSHI SPELL Bee 2024-25

సూర్యాపేట టౌన్: ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి, డ్యూక్స్ వాఫీ సహకారంతో సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ 2వ లెవల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షలో సూర్యాపేటలోని జయ పాఠశాల, కోదాడలోని తేజ విద్యాలయం, ఎస్పీఆర్ గురుకుల్ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాక్షి స్పెల్ బీ కేటగిరి 1 నుంచి 4వరకు, మ్యాథ్స్ బీ కేటగిరి 1 నుంచి 4 వరకు పరీక్ష నిర్వహించారు. సాక్షి స్పెల్ బి కేటగిరి 1లో ఇద్దరు, కేటగిరి 2లో ఆరుగురు, కేటగిరి 3లో 69 మంది, కేటగిరి 4 పరీక్షకు 30 మంది హాజరయ్యారు. అలాగే మ్యాథ్స్ బీ కేటగిరి 1లో ఇద్దరు, కేటగిరి 2లో నలుగురు, కేటగిరి 3లో 11మంది, కేటగిరి 4లో ఇద్దరు పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో జయ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, కోదాడ తేజ విద్యాలయం కరస్పాండెంట్ సోమిరెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు ఎం.బ్రహ్మారెడ్డి, సౌజన్య, కోదాడ ఎస్పీఆర్ గురుకుల్ పాఠశాల యాజమాన్యం మల్లెల శ్రావణి, యడ్మ మేధ, యాడ్స్ అసిస్టెంట్ ఆఫీసర్ వేములకొండ జానయ్య, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ అనమాల యాకయ్య, టౌన్ రిపోర్టర్ మాదగాని వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

SAKSHI MATH BEE

కొత్త పదాలు నేర్చుకున్నా



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్ష రాశాను. మొదటి లెవల్‌లో క్వాలిఫై అయి రెండో లెవల్ పరీక్ష రాశాను. ఈ పరీక్ష రాయడం ఎంతో ఆనందంగా ఉంది. అలాగే ఇంగ్లిష్‌లో కొత్త పదాలు నేర్చుకున్నా. గత సంవత్సరం కూడా పరీక్ష రాశాను.

– శ్రేష్ఠ, 7వ తరగతి, జయ పాఠశాల,సూర్యాపేట

స్పెల్లింగ్ మిస్టేక్ లేకుండా రాశా



సాక్షి స్పెల్ బీ పరీక్ష రాశాను. ఈ పరీక్ష రాయడం చాలా హ్యాపీగా ఉంది. పరీక్ష రాస్తున్నంత సేపు ఎన్నో కొత్త ఇంగ్లిష్ పదాలు నేర్చుకున్నా. ఈ పదాలు ముున్ముందు ఎంతగానో ఉపయోగపడతాయి. స్పెల్లింగ్ మిస్టేక్ లేకుండా పరీక్ష రాశాను.

– కీర్తన, 7వ తరగతి, జయ పాఠశాల, సూర్యాపేట

అనుభవం వచ్చింది



సాక్షి స్పెల్‌బీ పరీక్ష రాయడం ద్వారా ఎంతగానో అనుభవం వచ్చింది. ఇలాంటి పరీక్ష రాయడం ద్వారా ఎలాంటి భయం లేకుండా భవిష్యత్‌లో పోటీ పరీక్షలు సులభంగా రాసేందుకు అవకాశం ఉంటుంది. పరీక్ష రాయడం ఆనందంగా ఉంది.

– అజ్మీత్ హుస్సేన్, 7వ తరగతి, తేజ విద్యాలయం, కోదాడ

పోటీ పరీక్షలకు ఉపయోగం



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్షలో పాల్గొనడం హ్యాపీగా ఉంది. మ్యాథ్స్ బీ పరీక్షలో కొన్ని టిప్స్ నేర్చుకున్నా. ముున్ముందు టిప్స్ ఎంతో ఉపయోగపడతాయి. భవిష్యత్‌లో పోటీ పరీక్షలు రాసేందుకు ఇలాంటి పరీక్షలు ఉపయోగపడతాయి.

– డి.కేదరి, 7వ తరగతి, ఎస్పీఆర్ గురుకుల్, కోదాడ

అనేక విషయాలు తెలుసుకున్నా



సాక్షి మీడియా నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్ష రాశాను. ఈ పరీక్ష రాయడం చాలా సంతోషంగా ఉంది. ఈ పరీక్ష రాయడం ద్వారా గణితంలో అనేక విషయాలు తెలుసుకున్నా. మ్యాథ్స్ సులభంగా అర్థం కావడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుంది.

– గర్విత, 6వ తరగతి, తేజ విద్యాలయం, కోదాడ

కొత్త పదాలు తెలుసుకుంటారు



సాక్షి మీడియా సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ నిర్వహించడం అభినందనీయం. ఇలాంటి పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోయి ఆత్మస్థైర్యం పెరుగుతుంది. అలాగే స్పెల్‌బీలో కొత్త ఇంగ్లిష్ పదాలు నేర్చుకుంటారు. పరీక్షలు నిర్వహిస్తున్న సాక్షి మీడియాకు ధన్యవాదాలు.

– బింగి జ్యోతి, జయ పాఠశాల డైరెక్టర్, సూర్యాపేట

12 ఏళ్లుగా పరీక్షలు రాస్తున్నారు



సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలను 12ఏళ్లుగా మా పాఠశాలల నుంచి విద్యార్థులు రాస్తున్నారు. మ్యాథ్స్ బీ పరీక్ష రాయడం ద్వారా గణితంలో టిప్స్ నేర్చుకుని గణితం సులభంగా చేయడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. ఇంగ్లిష్ పదాలు అర్థం చేసుకోవడానికి స్పెల్‌బీ పరీక్ష ఉపయోగపడుతుంది.

– ఎం.బ్రహ్మారెడ్డి, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు, తేజ విద్యాలయం కోదాడ

పోటీతత్వం పెరుగుతుంది



సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్ష రాయడం ద్వారా విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుతుంది. భవిష్యత్‌లో కాంపిటేట్ పరీక్షలు రాసేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయి. స్పెల్‌బీలో అనేక కొత్త ఇంగ్లిష్ పదాలు నేర్చుకుంటారు. విద్యార్థులు మెదడుకు పదును పెడుతూ పరీక్షలు రాశారు. సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ పరీక్షలు రాశారు.

– మల్లెల శ్రావణి, ఎస్పీఆర్ గురుకుల్ స్కూల్ యాజమాన్యం, కోదాడ